RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in




సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 229 | పేజీలు : 08 | శనివారం | 29-08-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

## రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా
# గట్టిగా వాదించండి

**నీటిపారుదలశాఖ సమీక్షలో సీఎం దిశానిర్దేశం**

**అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష**

**సుప్రీంకోర్టు, సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీలో వాదించాల్సిన అంశాలపై సమీక్ష**

**మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని ఆదేశం**



హైదరాబాద్ పల్స్,డెస్క్

అంతర్రాష్ట్ర జల వివాదాలపై వివిధ వేదికలపై రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. సెప్టెంబరు 1న తుమ్మిడిహట్టిపై దిల్లీలో జరగనున్న అధికారుల భేటీ, సెప్టెంబరు 7న సీడబ్ల్యూసీ హైలెవెల్ కమిటీ సమావేశ ఎజెండాపై చర్చించినట్లు తెలుస్తోంది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నీటిపారుదల శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.

కేసులపై సీఎం ఆరా

మహారాష్ట్ర, ఏపీతో వివాదాలపై అధికారులు, న్యాయవాదులు తెలంగాణ వైఖరిని స్పష్టం చేయాలని సీఎం సూచించినట్లు సమాచారం. సుప్రీంకోర్టు, కేంద్ర జలవనరుల సంఘం,

## రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన
# కొండా సురేఖ..

**రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య**



**రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన కొండా సురేఖ**

**రేవంత్ తో పాటు ఆయన అల్లుడు, మనవడికి రాఖీ కట్టిన సురేఖ**

**రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు రేవంత్ కు ఉంటాయని వ్యాఖ్య**

## సమగ్ర విశ్లేషణతోనే
# నేరాల కట్టడి
### :డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ పల్స్,డెస్క్

నేరాల దర్యాప్తు, పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ (ఎవశ్రీఖఅస్త్రుఖ ణ౯ూ జఎ



## వారం రోజుల్లోగా
# పరిష్కారం చూపాలి

**ప్రజల నుంచి వాట్సాప్ ద్వారా దరఖాస్తులు వచ్చినా పరిష్కరించాలి**

**అధికారులకు మంత్రి జూపల్లి ఆదేశం**

**ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగే పరిస్థితి ఉండకూడదన్న జూపల్లి**

**ప్రజల దరఖాస్తులకు వారం రోజుల్లోగా పరిష్కారం చూపాలని ఆదేశం**

**అధికారులు పాత పనితీరును మార్చుకోవాలని హెచ్చరిక**

## యూరియా సరఫరాలో
# ఎలాంటి ఇబ్బందులు లేవు
### :మంత్రి తుమ్మల

హైదరాబాద్ పల్స్,డెస్క్

వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో పనిముట్లు ఖరారు చేశామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యాంత్రీకరణ సబ్సిడీ నిధులను నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం

## అర్హులైన పేదలందరికీ
# ఇందిరమ్మ ఇళ్లు

**మంత్రి పొంగులేటి హామీ**

**అర్హులైన పేదలకు నిష్పక్షపాతంగా ఇందిరమ్మ ఇళ్లు**

**జీహెచ్ఎంసీ పరిధిలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక**

**మొదటి విడతలో 7,350 ఇళ్ల కేటాయింపు ప్రక్రియ**

**10 రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితా వెల్లడి**

**విలువైన భూముల్లోనూ పేదల కోసం ఇళ్ల నిర్మాణం**



హైదరాబాద్ పల్స్,డెస్క్

తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ఎటువంటి వివక్ష లేకుండా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో తొలి విడతలో భాగంగా 7,350 ఇళ్లను లాటరీ పద్ధతి ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని ఆయన తెలిపారు. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలో నిర్వహించిన లక్కీ డ్రా



## ఇంటర్ అర్హతతో
# 15,982 పోస్టుల భర్తీ

**తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర..**

**సెప్టెంబర్ నాటికి నియామకాలు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం**

**ఇంటర్ పాసైన వారు అర్హులు,ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక**

**ఎంపికలో ఇంటర్ మార్కులకు 70 శాతం వెయిటేజీ**

**రెండు జోన్ల పరిధిలో టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీ**

# పెద్ద డ్రామా నడిపింది

**వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా నడిపింది: కవిత**

**సింగరేణి కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్న కవిత**

**అనారోగ్యంతో బాధపడుతున్న కార్మిక కుటుంబాలకు న్యాయం చేయడం లేదని మండిపాటు**

**ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని హెచ్చరిక**



హైదరాబాద్ పల్స్,డెస్క్

కష్టపడి పనిచేసే సింగరేణి కార్మికుల సంక్షేమంపై కాంగ్రెస్ సర్కార్ తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మెడికల్ బోర్డు ప్రక్రియను ఒక పెద్ద మొక్కుబడి డ్రామాగా మార్చేసి, అనారోగ్యంతో ఉన్న కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని

## ఎవరి జాగీరు అని
# మీ ఫొటోలు వేసుకుంటున్నారు?

**కాంగ్రెస్ నేతలపై ఈటల ఫైర్**

**కేసీఆర్ పాలనకు, రేవంత్ పాలనకు తేడా లేదన్న ఈటల**

**సన్న బియ్యం కేంద్రం ఇస్తున్నా మోదీ ఫొటో వేయడం లేదని మండిపాటు**

**కేంద్ర నిధుల వల్లే రాష్ట్రంలో రోడ్లు, రైల్వేలు అభివృద్ధి చెందుతున్నాయని వ్యాఖ్య**



హైదరాబాద్ పల్స్,డెస్క్

తెలంగాణలో గత కేసీఆర్ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలనకు ఎలాంటి వ్యత్యాసం లేదని... ఈ పాలనతో రాష్ట్ర ప్రజలు పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని భావిస్తున్నారని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

# నియోజకవర్గాల విజన్ ప్లాన్..

**పనితీరుకు అదే ప్రామాణికం: సీఎం చంద్రబాబు**

**ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్**

**ప్రజాప్రతినిధులు నిరంతరం సమీక్షలు జరుపుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశం**

**అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్, ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు**

**టెక్నాలజీని వాడుకుంటూ వినూత్నంగా ఆలోచించాలని సూచన**

**రాష్ట్ర విజన్ ప్లాన్ యూనిట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వెల్లడి**




హైదరాబాద్ పల్స్,డెస్క్

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడం, పేదరిక రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్' పనితీరుకు

# వారం రోజుల్లోగా పరిష్కారం చూపాలి

మొదటి పేజీ రువాయి

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగే పరిస్థితి ఉండకూడదని... వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా దరఖాస్తు పంపినా అధికారులు తక్షణమే స్పందించాలని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. పానగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రజా సమస్యల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండున్నర ఏళ్లుగా ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారంపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలు తమ రోజువారీ పనుల్లో బిజీగా ఉంటారని, అందుకే పేరు, చిరునామా, ఫోన్ నంబర్‌తో కూడిన రాతపూర్వక ఫిర్యాదును వాట్సాప్ లేదా ఈమెయిల్ ద్వారా సంబంధిత అధికారులకు పంపవచ్చని వెల్లడించారు. అధికారులు ఆ దరఖాస్తులను ప్రింట్ తీసుకుని వెంటనే పరిశీలించాలని ఆదేశించారు. ప్రజలు ఇచ్చే దరఖాస్తులకు గరిష్ఠంగా వారం రోజుల్లో పరిష్కారం చూపాలని, ముఖ్యంగా విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను రెండు మూడ్రోజుల్లోనే జారీ చేయాలని స్పష్టమైన గడువు విధించారు. అధికారులు తమ పాత పనితీరును మార్చుకోవాలని, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని జూపల్లి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ..

మొదటి పేజీ రువాయి

తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల భేటీ పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పరకాల నియోజకవర్గ వివాదంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ నేరుగా సీఎం రేవంత్‌పై చేసిన వ్యాఖ్యలు, ఆపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ చర్యలకు సిద్ధమవ్వడం కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి సురేఖపై వేటు పడుతుందనే ప్రచారం జరుగుతున్న తరుణంలో, రాఖీ పండుగను పురస్కరించుకుని ఆమె నేరుగా సీఎం నివాసానికి వెళ్లడం విశేషం. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డితో పాటు ఆయన మనవడికి, అల్లుడికి కొండా సురేఖ ఎంతో ఆత్మీయంగా రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ పవిత్రమైన పండుగ రోజున ఎలాంటి రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. తాను అందరికీ సోదరినని, రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు, అండదండలు సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే శక్తిని, ఆయురారోగ్యాలను ఆయనకు ప్రసాదించాలని దేవుడిని కోరుకున్నట్లు సురేఖ తెలిపారు.

# సమగ్ర విశ్లేషణతోనే నేరాల కట్టడి

మొదటి పేజీ రువాయి

ూఖుఅఎ) ఆదేశించారు. నేరాల సమీక్షను కేవలం గణాంకాలకే పరిమితం చేయకుండా.. ప్రతి నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానం, దర్యాప్తు తీరు, ఆయా కేసుల పరిష్కారాన్ని సమగ్రంగా విశ్లేషించాలని సూచించారు. అన్ని యూనిట్ల పోలీసు ఉన్నతాధికారులతో ఈరోజు (శుక్రవారం) డీజీపీ కార్యాలయంలో అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని యూనిట్ల పోలీసు అధికారులకు పలు కీలక అంశాలపై డీజీపీ దిశా నిర్దేశం చేశారు.

క్రైమ్ రివ్యూ సమావేశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి..

ఇటీవల సీసీటీఎన్ఎస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో గతంలో 70 నుంచి 80 శాతంగా ఉన్న.. సీసీటీఎన్ఎస్ డేటా అప్‌డేట్.. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో 96 శాతానికి చేరడం అభినందనీయమని డీజీపీ పేర్కొన్నారు. ప్రతి నెల నిర్వహించే క్రైమ్ రివ్యూ సమావేశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు పాటించాల్సిన ప్రాథమిక విధానాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రొఫెషనల్ స్టాండర్డ్స్‌ను పాటించడాన్ని అధికారులు పోటీగా తీసుకోవాలని సూచించారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. ఆయా జిల్లాల పర్యటనలు, పోలీస్‌స్టేషన్ల తనిఖీల సమయంలో గుర్తించే అంశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. నేరాల ధోరణిని ముందుగానే గుర్తించి, అవసరమైన చోట ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశానికి డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయెల్, ఉమెన్ సేఫ్టీ, సీఐడీ డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా హాజరయ్యారు. అలాగే, రాష్ట్రంలోని అన్ని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సైబర్, ఆర్థిక నేరాలు తగ్గాయి..

సాంకేతికతను నేర నియంత్రణకు సాధనంగా వినియోగించాలని డీజీపీ సూచించారు. సైబర్, ఆర్థిక నేరాలు తగ్గాయని అన్నారు. మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టిసారించామని వెల్లడించారు. ఆయా యూనిట్ల వారీగా నెలవారీ సమీక్షలు తప్పనిసరని స్పష్టం చేశారు. బేసిక్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని మార్గనిర్దేశం చేశారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని ఆదేశించారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మొదటి పేజీ రువాయి

కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా కేవలం అర్హతనే ప్రామాణికంగా తీసుకుని ఇళ్ల పంపిణీ చేపడుతున్నామని వెల్లడించారు. ఇప్పటికే కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని వివరించారు. పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా వందల కోట్ల రూపాయల విలువైన భూముల్లో సైతం గృహాలను నిర్మించి అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. రాబోయే పది రోజుల్లో రెండో విడత లబ్ధిదారుల జాబితాను కూడా ప్రకటించే అవకాశం ఉందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను సేకరించి, టెండర్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. మరో రెండు, మూడు రోజుల్లో ఆయా ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు.

# పెద్ద డ్రామా నడిపింది

మొదటి పేజీ రువాయి

విమర్శించారు. వైద్య పరీక్షల పేరుతో ప్రభుత్వం పెద్ద ఎత్తున డ్రామా నడిపిందని కవిత ఆరోపించారు. దాదాపు 120 మంది కార్మికులను మెడికల్ బోర్డు ముందుకు రప్పించి, అందులో కేవలం 12 మందిని మాత్రమే 'అన్‌ఫిట్' అని తేల్చడం కాంగ్రెస్ ప్రభుత్వ దారుణమైన వైఖరికి, అన్యాయానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. అనారోగ్యంతో సతమతమవుతున్న కార్మిక కుటుంబాలకు ఊరటనిచ్చే ఉద్దేశం గానీ, వారికి భరోసానిచ్చే చిత్తశుద్ధి గానీ ఈ ప్రభుత్వానికి ఎంతమాత్రం లేదని అన్నారు. మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ అర్హులైన కార్మికుడిని తక్షణమే అన్‌ఫిట్‌గా గుర్తించాలని, వారి వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని స్పష్టం చేశారు. కంటితుడుపు చర్యలతో కార్మికుల చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తే రాబోయే రోజుల్లో సింగరేణి బొగ్గు గని క్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. బాధితులైన ప్రతి సింగరేణి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు..

# రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేలా గట్టిగా వాదించండి

మొదటి పేజీ రువాయి

కృష్ణా, గోదావరి నదీ జలాల నిర్వహణ బోర్డుల్లో ఉన్న వివిధ కేసులపై సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చర్చించారు. కేసులు ఏ దశలో ఉన్నాయి?, ఇతర రాష్ట్రాల వాదనలేంటి?, తెలంగాణ ప్రయోజనాలు వంటి అంశాలపై సీఎం ఆరా తీసినట్లు సమాచారం. సమీక్షలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కీలకంగా కేఆర్ఎంబీ సమావేశం

ఈనెల 26న జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డులో ప్రభుత్వం తమ అభ్యంతరాలను వివరించింది. ఈఎన్సీ జనరల్ రమేశ్‌బాబు 2027 ఆగస్టు వరకు తాగునీటి అవసరాల కోసం 112 టీఎంసీల నీటిని కేటాయించాలని బోర్డును కోరారు. ఈ మేరకు శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో అవసరమైన నీటి నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ కోరింది. అలాగే తాగునీటి అవసరాల కోసం తమకు 47 టీఎంసీలు కేటాయించలన్న ఏపీ ప్రతిపాదనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే వాయిదా పడింది. తదుపరి సెప్టెంబర్ నాలుగున జరిగే తదుపరి సమావేశంలోనూ తెలంగాణ ప్రభుత్వ ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని అధికారులను ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాపాతం లోటును దృష్టిలో ఉంచుకొని తాగునీటి విషయంలో రాజీ పడకుండా ఉండాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.

# యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవు :మంత్రి తుమ్మల

మొదటి పేజీ రువాయి

వ్యవసాయశాఖపై మంత్రి తుమ్మల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. ఎంప్యానెల్ సంస్థల జాబితాను హాకా అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు.

ఆ యాప్‌పై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి..

యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని మంత్రి స్పష్టం చేశారు. ఫెర్టిలైజర్ యాప్ సమస్యలను.. అదే రోజే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్‌పై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కాంప్లెక్స్ ఎరువులకూ సబ్సిడీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అన్నదాతలు యూరియాను అధికంగా వాడే పరిస్థితి మారాలని అన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో వేగం పెంచాలని ఆదేశించారు. రైతులకు 2 నుంచి 3 రోజుల్లోనే ఆయిల్‌పామ్ మొక్కలు అందేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు.

ఆయిల్‌పామ్ మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేయాలి..

డిమాండ్ ఎక్కువగా ఉన్న జిల్లాలకు మొక్కల సరఫరాలో ప్రాధాన్యం కల్పించాలని మంత్రి అన్నారు. లక్ష్యానికి రెండింతల ఆయిల్‌పామ్ మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేయాలని సూచించారు. డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటును వేగవంతం చేయాలని ఆదేశించారు. 2600 రైతు వేదికలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. 2 నుంచి 3 నెలల్లో రైతు వేదికలపై సోలార్ పనులు పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిశానిర్దేశం చేశారు.

# ఇంటర్ అర్హతతో 5,982 పోస్టుల భర్తీ

మొదటి పేజీ రువాయి

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 15,982 పోస్టులను సెప్టెంబర్ నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్-1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్-2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# ఎవరి జాగీరు అని మీ ఫొటోలు వేసుకుంటున్నారు?

మొదటి పేజీ రువాయి

విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఐదు కిలోల సన్న బియ్యం ఉచితంగా ఇస్తున్నప్పటికీ ప్రధాని మోదీ ఫొటోను ఎక్కడా వేయడం లేదని... కానీ కాంగ్రెస్ నేతలు ఎవరి జాగీరని వారి ఫొటోలు వేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి దేశంలో మత కల్లోలాలు జరుగుతున్నాయని ప్రచారం చేస్తున్నారని విమర్శించిన ఈటల, గతంలో కాంగ్రెస్ హయాంలోనే లుంబిని పార్క్, గోకుల్ చాట్‌లలో బాంబు పేలుళ్లు జరిగాయని గుర్తు చేశారు. ఢిల్లీ వెళ్లినప్పుడు మోదీ ఆశీర్వాదం కావాలని కోరే సీఎం రేవంత్... ఇక్కడకు వచ్చాక మాత్రం విమర్శలు చేయడం ఆయన ద్వంద్వ విధానానికి నిదర్శనమన్నారు. కేంద్రం ఇచ్చే నిధుల వల్లే రాష్ట్రంలో రహదారులు, రైల్వేలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు వేసి, కాంగ్రెస్ నాయకులకు కేటాయించుకుంటున్నారని ఈటల మండిపడ్డారు. 'ఇది మీ తాత జాగీరు కాదు' అంటూ ఈటల మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు, మెట్రో ఫేజ్-1, ఫేజ్-2లకు తగిన సహాయం అందిస్తోందని స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరి, మేడ్చల్ పరిధిలోని పలు రైల్వే గేట్ల వద్ద ఆర్‌వోబీ, ఆర్‌యూబీ నిర్మాణాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ అంశంపై సీఎస్‌ను కలిసి చర్చించానన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి స్టేషన్ల అభివృద్ధికి అమృత్ పథకం కింద కేంద్రం రూ.22 కోట్లు ఇస్తోందని ఈటల వెల్లడించారు.

# నియోజకవర్గాల విజన్ ప్లాన్..

మొదటి పేజీ రువాయి

ప్రామాణికంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రణాళిక అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు కీలక పాత్ర పోషించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే అద్భుత ఫలితాలు సాధించగలమని ఆయన దిశానిర్దేశం చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో పాటు యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా నిర్దిష్ట విజన్ ప్లాన్‌ను రూపొందించుకుని అమలు చేయడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా జరుగుతోందని, ఈ వినూత్న కార్యక్రమానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి తెలిపారు. కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లకు అనుగుణంగా ప్రతి రంగంలో వృద్ధి సాధించేలా పనిచేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలైనప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసినప్పుడు అద్భుత ఫలితాలు వస్తాయని, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి లభించిన ప్రజా స్పందనే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. ఈ విజన్ ప్లాన్ అమలులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. సంప్రదాయ ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'డేటా లేక్' లోని సమాచారాన్ని విశ్లేషించుకోవాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెంచేందుకు ఇప్పటికే 1.50 కోట్ల ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేశారని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం కేవలం నగదు బదిలీ కాదని, లబ్ధిదారులను ఆర్థికంగా నిలబెట్టి వారిలో సాధికారత తీసుకురావడమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ా4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే భరోసా కల్పించాలన్నారు. జిల్లాలకు, నియోజకవర్గాలకు వస్తున్న పరిశ్రమలు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేలా (గ్రౌండింగ్) ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారకుండా ఉండేందుకే 'తల్లికి వందనం', 'సంజీవని' వంటి పథకాలు తెచ్చామని సీఎం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ప్రక్రియకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు జరిగినా, పారదర్శకంగా పూర్తి చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేశామని, దీనిపై విమర్శలు వస్తే టీచర్లే స్వయంగా ఉద్యమించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలను మెప్పించగలిగితే వారి నుంచి సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుందని సీఎం ఉద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల సాయంతో

# పోగొట్టుకున్న బంగారం గుర్తింపు

పుల్కల్, ఆగస్టు 28, హైదరాబాద్ పల్స్ న్యూస్: ఆటోలో ప్రయాణిస్తుండగా పోగొట్టుకున్న సుమారు 15 తులాల బంగారు నగలు, రూ.15 వేల నగదు, మొబైల్ ఫోన్‌ను సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా పోలీసులు గుర్తించి బాధితుడికి అప్పగించారు.పుల్కల్ మండలం గొంగ్లూరు గిరిజన తండాకు చెందిన పోస్టుమ్యాన్ రమావత్ అమర్‌సింగ్ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో ప్రయాణిస్తుండగా బంగారు నగలు, నగదు, మొబైల్ ఫోన్ ఉన్న బ్యాగ్ రోడ్డుపై పడిపోయింది. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.పోలీసులు గంగోజిపేట, తాడ్దానిపల్లి పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. వాటి ఆధారంగా ఇషోజిపేట



గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు బంగారు నగలు దొరికినట్లు గుర్తించారు. వారిని సంప్రదించిన పోలీసులు బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు.అనంతరం ఎస్సై నల్లా విశ్వజన్ బంగారు నగలను బాధితుడు అమర్‌సింగ్‌కు అప్పగించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై విశ్వజన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామ సర్పంచ్‌లకు సూచించారు. సీసీ కెమెరాల ద్వారా నేరాల నియంత్రణతో పాటు తప్పిపోయిన వస్తువులు, వ్యక్తుల ఆచూకీని గుర్తించడంలో కూడా ప్రయోజనం ఉంటుందని తెలిపారు.

# బొమ్మరెడ్డిగూడెంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

### రాఖీ ప్రేమానురాగాలకు ప్రతీక : సర్పంచ్ జైపాల్ నాయక్

చౌటకూర్, ఆగస్టు 28, హైదరాబాద్ పల్స్ న్యూస్: చౌటకూర్ మండలంలోని బొమ్మరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు రాఖీలు కట్టుకుని రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్ మాట్లాడుతూ శ్రావణ మాసంలో జరుపుకునే రక్షాబంధన్ భారతీయ సంస్కృతిలో ప్రత్యేకమైన పండుగ అని అన్నారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, అనురాగం, ఆప్యాయత, రక్షణకు రాఖీ ప్రతీకగా నిలుస్తుందని



తెలిపారు.కుటుంబ బంధాలను మరింత బలపరిచే ఈ పండుగ సందర్భంగా సోదరి తన సోదరుడి చేతికి రాఖీ కట్టి ఆయన క్షేమం, సుఖసంతోషాలను కోరుకుంటుందని, సోదరుడు తన సోదరికి అండగా ఉంటానని ప్రతిజ్ఞ చేయడం సంప్రదాయంగా వస్తోందన్నారు."రాఖీ కేవలం ఒక దారం కాదు.. అన్నాచెల్లెళ్ల మధ్య అనుబంధాన్ని కలిపే ప్రేమ బంధం. ఇది నమ్మకం, ఆత్మీయతకు ప్రతీక. నేను నీకు రక్ష.. నీవు నాకు రక్ష.. మనమందరం దేశానికి, ధర్మానికి రక్ష" అనే సందేశంతో వేడుకలను నిర్వహించుకున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు సుభాష్, అశ్విత, కిట్టు, నాయకులు రవీందర్ కార్బరి, రాజు, బొమ్మ రాజు, శ్రీనివాస్, జైల్ సింగ్, సర్వన్, మిన్పూర్ బుచ్చయ్య, బద్రీనాథ్, శివ, రణిజ్య, మునిలాల్, సుభాష్, ఇంద్రు, తిలక్, అభిలాష్, అకేష్, రాహుల్, ప్రభు, పాండు తదితరులు పాల్గొన్నారు.

# రూ.1.13 కోట్ల విలువైన కాపర్ ముడి పదార్థం స్వాధీనం

**కాపర్ ముడి పదార్థం దోపిడీ కేసులో ఒకరి అరెస్ట్. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో కేసు ఛేదించిన పోలీసులు.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, సంగారెడ్డి ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా మునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ కాపర్ ముడి పదార్థం దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఒక నిందితుడిని అరెస్ట్ చేసి, సుమారు రూ.1.13 కోట్ల విలువైన 123 బ్యాగుల కాపర్ ముడి పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. దోపిడీకి ఉపయోగించిన రెండు వాహనాలతో పాటు చోరీకి గురైన ఈచర్ వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు

**కత్తులతో బెదిరించి వాహనం అడ్డగింత**

పోలీసుల వివరాల ప్రకారం.. ఆగస్టు 18, 19 తేదీల మధ్య అర్ధరాత్రి హైదరాబాద్‌లోని బోలక్‌పూర్, ముషీరాబాద్ ప్రాంతంలోని సన్‌లైట్ మెటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి 171 ప్లాస్టిక్ సంచుల్లో కాపర్ ముడి పదార్థాన్ని ముంబై, అమర్‌నాథ్‌కు తరలిస్తున్నారు.ఎంహెచ్13డీక్యూ5107 నంబరు గల ఈచర్ వాహనం సంగారెడ్డి జిల్లా మునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి-65పై బుదేరా వంతెన దాటిన అనంతరం పాట్నం రహదారి హోటల్ సమీపానికి చేరుకోగానే నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు కారులో వచ్చి వాహనాన్ని అడ్డగించారు.కత్తులతో బెదిరించి వాహన డ్రైవర్ సైఫూన్, తండ్రి ఇమామ్‌ను బలవంతంగా తమ కారులోకి ఎక్కించుకున్నారు. అనంతరం ఆరూర్ పరిధిలో ఆయనను వదిలివెళ్లారు.

**జీపీఎస్ ఆధారంగా ఈచర్ వాహనం గుర్తింపు**

సమాచారం అందుకున్న వెంటనే మునిపల్లి పోలీసులు స్పందించారు. ఈచర్ వాహనంలోని జీపీఎస్ పరికరం ద్వారా దాని కదలికలను గుర్తించి తెల్లవారుజామున సుమారు 4.30 గంటలకు ఆరూర్ పరిధిలో వాహనాన్ని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 48




సంచుల కాపర్ ముడి పదార్థం మాత్రమే ఉంది. మరో 123 సంచులు చోరీకి గురైనట్లు పోలీసులు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.1.13 కోట్లుగా నిర్ధారించారు.

**ప్రత్యేక బృందాలతో దర్యాప్తు**

బాధితుడు మొహమ్మద్ ఫయాజుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మునిపల్లి పోలీస్ స్టేషన్‌లో నేర సంఖ్య 124/2026 కింద భారతీయ న్యాయ సంహితలోని 309(4) సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేశారు.జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు సంగారెడ్డి నేర పరిశోధన విభాగం, మునిపల్లి, సదాశివపేట పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలతో పాటు వాహనాల కదలికలు, టోల్‌గేట్ల వద్ద నమోదైన సమాచారాన్ని పోలీసులు విశ్లేషించారు.ఈ క్రమంలో ఆగస్టు 27న అనుమానిత డీసీఎం వాహనం టీజీ12టీ9240 కంకోల్ టోల్‌గేట్ దాటి జహీరాబాద్ వైపు వెళుతున్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసు బృందం దిగ్వాల్ గ్రామం సమీపంలో సాయంత్రం 5.32 గంటలకు వాహనాన్ని అడ్డుకుని తనిఖీ చేసింది.వాహనంలో ఉన్న షేక్ సబీర్ షరీఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**మరో 10 నుంచి 11 మంది ప్రమేయం?**

పోలీసుల విచారణలో సబీర్ షరీఫ్ తన ప్రమేయాన్ని వెల్లడించడంతో పాటు ప్రధాన నిందితుడిగా పేర్కొన్న సోహెల్‌తో పాటు మరో 10 నుంచి 11 మంది ఈ దోపిడీలో పాల్గొన్నట్లు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు.చోరీ చేసిన కాపర్ ముడి పదార్థాన్ని తరలించేందుకు టీజీ12టీ9240 నంబరు గల డీసీఎం వాహనంతో పాటు టీఎస్08యూహెచ్8812 నంబరు గల అశోక్ లేలాండ్ దోస్ట్ వాహనాన్ని ఉపయోగించినట్లు విచారణలో వెల్లడైంది.నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు తదుపరి దర్యాప్తు చేపట్టి చోరీకి గురైన కాపర్ ముడి పదార్థాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

**స్వాధీనం చేసుకున్న సొత్తు**

123 ప్లాస్టిక్ సంచుల్లోని చోరీకి గురైన కాపర్ ముడి పదార్థం.నల్లటి టార్పాలిన్ కవర్.టీజీ12టీ9240 నంబరు గల డీసీఎం వాహనం.టీఎస్08యూహెచ్8812 నంబరు గల అశోక్ లేలాండ్ దోస్ట్ వాహనం.ఎంహెచ్13డీక్యూ5107 నంబరు గల చోరీకి గురైన ఈచర్ వాహనం, అందులోని 48 సంచుల కాపర్ ముడి పదార్థం.స్వాధీనం చేసుకున్న కాపర్ ముడి పదార్థం మొత్తం విలువ సుమారు రూ.1.13 కోట్లుగా పోలీసులు తెలిపారు.

**పోలీసు బృందాలకు ఎస్పీ అభినందనలు:**

సమాచారం అందుకున్న వెంటనే స్పందించి జీపీఎస్ ఆధారంగా ఈచర్ వాహనాన్ని గుర్తించడం, సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలను విశ్లేషించడం, వాహనాల కదలికలు, టోల్‌గేట్ సమాచారాన్ని పరిశీలించడం ద్వారా కేసును ఛేదించిన పోలీసు బృందాల పనితీరును జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.భారీ మొత్తంలో దొంగసొత్తును స్వాధీనం చేసుకుని కేసును త్వరితగతిన ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన సంగారెడ్డి నేర పరిశోధన విభాగం, మునిపల్లి, సదాశివపేట పోలీసుల సమన్వయ కృషిని ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు.

# సుమేర్ జైన్‌కు ఆత్మీయ అభినందనలు

### రెండోసారి అధ్యక్ష బాధ్యతలు..రాఖీ పౌర్ణమి వేళ శుభాకాంక్షలు తెలిపిన కొత్త కిషోర్

**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 28, డోర్నకల్:** డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కాలా సుమేర్ జైన్ రెండోసారి బాధ్యతలు చేపట్టడంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టణంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలని పలువురు ఆకాంక్షించారు.డోర్నకల్ పట్టణంలోని యాదవ్‌నగర్‌లో నందకిషోర్ ఏజెన్సీ నిర్వాహకుడు కొత్త కిషోర్ కుమార్ సుమేర్ జైన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం మిఠాయి తినిపించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సుమేర్ జైన్ నాయకత్వంలో పార్టీ మరింతగా ప్రజల్లోకి వెళ్లాలని, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఆకాంక్షించారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా సుమేర్ జైన్ నివాసంలో ఆత్మీయ వాతావరణం నెలకొంది. పార్టీ బాధ్యతలతో పాటు ప్రజా సేవకు ప్రాధాన్యతనిస్తూ పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండాలని పలువురు సూచించారు. ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.రానున్న రోజుల్లో కార్యకర్తలకు అండగా నిలుస్తూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. సుమేర్ జైన్‌కు లభిస్తున్న అభినందనలు, శుభాకాంక్షలు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయని స్థానిక నాయకులు పేర్కొన్నారు.



# కుటుంబ బంధాలే సమాజానికి బలం - ముద్దం నర్సింహ యాదవ్

### కుటుంబ సభ్యులు, డివిజన్ మహిళల ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు

ఆగస్టు 28, ఓల్డ్ బోయినపల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి): రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఓల్డ్ బోయినపల్లిలో రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ కుటుంబ సభ్యులతో



పాటు ఓల్డ్ బోయినపల్లి, హస్మత్‌పేట్ ప్రాంతాలకు చెందిన మహిళలు, కుటుంబ సభ్యులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళలు ముద్దం నర్సింహ యాదవ్‌కు ప్రేమాభిమానాలకు ప్రతీకగా రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాఖీ కేవలం చేతికి కట్టే దారం మాత్రమే కాదని, అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమ, నమ్మకం, రక్షణ, బాధ్యతలకు ప్రతీక అని అన్నారు.కుటుంబ బంధాలు బలంగా ఉన్నప్పుడే సమాజం మరింత ఐక్యంగా, శక్తివంతంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, అన్నాచెల్లెళ్ల అనుబంధం చిరకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రేమ, ఆప్యాయత, ఐక్యత మరింత బలపడాలని కోరుకున్నారు.

# రాఖీలతో కళకళలాడిన ఎమ్మెల్యే నివాసం

### అక్కాచెల్లెళ్ల ఆత్మీయత మధ్య మల్లారెడ్డి రాఖీ పౌర్ణమి వేడుకలు

**ఆగస్టు 28, బోయినపల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):** మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి స్వగృహంలో రాఖీ పౌర్ణమి వేడుకలు కుటుంబ సభ్యులు, మహిళల మధ్య ఘనంగా జరిగాయి. ఉదయాన్నే ఆయన అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు.



అనంతరం మల్లారెడ్డి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా చిన్ననాటి నుంచి అక్కాచెల్లెళ్లతో ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన పలువురు మహిళా కౌన్సిలర్లు, మహిళలు కూడా మల్లారెడ్డికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.దేశ ప్రజలు, తెలుగు రాష్ట్రాల ప్రజలు, మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు, అక్కాచెల్లెళ్లకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన మల్లారెడ్డి.. అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మహిళలకు మల్లారెడ్డి దంపతులు చిరు కానుకలు అందజేశారు.

# రాఖీ బంధంతో వెల్లివిరిసిన ప్రేమానురాగాలు

### ఓల్డ్ బోయినపల్లిలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు.. రాఖీలు, మిఠాయిల కొనుగోళ్లతో సందడి

ఆగస్టు 28, ఓల్డ్ బోయినపల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి): తెలుగు రాష్ట్రాల్లో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర రక్షణకు ప్రతీకగా



జరుపుకునే రక్షాబంధన్ సందర్భంగా ఓల్డ్ బోయినపల్లిలో పండుగ సందడి నెలకొంది.సోదరీమణులు తమ సోదరుల సుఖసంతోషాలు, అభివృద్ధిని ఆకాంక్షిస్తూ రాఖీలు కట్టారు. సోదరులు జీవితాంతం అండగా ఉంటామని భరోసా ఇస్తూ సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన రాఖీ వేడుకలతో ఇళ్లన్నీ సందడిగా మారాయి.శ్రావణ పౌర్ణమి సందర్భంగా జంధ్యాల పౌర్ణమి, గాయత్రీ జయంతి వంటి ఆధ్యాత్మిక విశేషాలను కూడా ప్రజలు గుర్తుచేసుకున్నారు. పౌరాణిక, చారిత్రక గాథల్లోనూ రక్షాబంధన్‌కు ప్రత్యేక స్థానం ఉంది.ఓల్డ్ బోయినపల్లి ప్రధాన చౌరస్తాలో రాఖీలు, మిఠాయిల విక్రయాలు జోరుగా సాగాయి. చిన్నారుల నుంచి పెద్దల వరకు వివిధ రకాల రాఖీలను కొనుగోలు చేసేందుకు మహిళలు, కుటుంబ సభ్యులు దుకాణాలకు తరలివచ్చారు. రాఖీ కట్టే వేడుకలతో అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఆనందం వెల్లివిరిసింది.రక్షాబంధన్ పర్వదినం సందర్భంగా హైదరాబాద్ పల్స్ న్యూస్ పాఠకులందరికీ శుభాకాంక్షలు.

# 22ఏ నిషేధిత భూముల బాధితులకు అండగా బీఆర్ఎస్ పోరాటం

**కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గే వరకు అవిశ్రాంత పోరాటం.**

**'నిరసన గళం' సభను విజయవంతం చేయండి.**

**ముఖ్య అతిథిగా మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు.. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి.**

హైదరాబాద్ పల్స్, ఆగస్టు 28, పటాన్‌చెరు: 22ఏ నిషేధిత భూముల జాబితాలో చేర్చిన భూముల బాధితులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పటాన్‌చెరు కేంద్రంగా నిర్వహించనున్న 'నిరసన గళం' సభను విజయవంతం చేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. 22ఏ భూముల సమస్యపై బాధితుల పక్షాన నిలిచి, వారి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు.నిరసన కార్యక్రమం ఏర్పాట్లపై శుక్రవారం జిన్నారం, గుమ్మడిదల, పటాన్‌చెరు మండలాలు, మున్సిపాలిటీలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, నాయకులు, కార్యకర్తలు, 22ఏ భూముల బాధితులను పెద్ద



సంఖ్యలో తరలించే అంశాలపై చర్చించారు.

ప్రజలు తీవ్ర ఇబ్బందులు

రియల్ ఎస్టేట్ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎలాంటి వివాదాలు లేని ప్రైవేట్, పట్టా భూములు, రిజిస్టర్డ్ ఇళ్లను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. 22ఏ జాబితాలో భూములు చేరడంతో ఆస్తులను విక్రయించుకోలేక, బ్యాంకు రుణాలు పొందలేక, అవసరాలకు ఆస్తులను వినియోగించుకోలేక ప్రజలు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బాధితులను లక్ష్యంగా చేసుకుని దళారుల దందా 22ఏ జాబితా నుంచి పేర్లు తొలగిస్తామంటూ కొంతమంది బ్రోకర్లు, దళారులు బాధితులను లక్ష్యంగా చేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. 30 శాతం వరకు కమీషన్లు డిమాండ్ చేస్తూ దందాలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం 22ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, నిషేధిత జాబితాలో చేర్చిన భూముల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు.


న్యాయం జరిగే వరకు పోరాటం

22ఏ నిషేధిత భూముల బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన నిలబడుతుందని మహిపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 22ఏ భూముల సమస్యకు సరైన పరిష్కారం చూపే వరకు అవిశ్రాంతంగా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.పటాన్‌చెరులోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల బాధితులు భారీ సంఖ్యలో తరలివచ్చి 'నిరసన గళం' సభను విజయవంతం చేయాలని గూడెం మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# స్కూల్ వద్ద దింపుతానని బాలికను హోటల్‌కు తీసుకెళ్లి అత్యాచారం

**ఉత్తరప్రదేశ్‌లో దారుణ ఘటన.. నిందితుడి అరెస్ట్**

ఆగష్టు 28, బులంద్‌షహర్
(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):
ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన ఘటన కలకలం రేపింది. పాఠశాల వద్ద దింపుతానని నమ్మించి బాలికను తీసుకెళ్లిన వ్యక్తి ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. బాలిక పాఠశాలకు వెళ్తుండగా ఆమెకు మామ వరుసయ్యే రిజ్వాన్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి అడ్డుకున్నాడు. పాఠశాల వద్ద దింపుతానని చెప్పడంతో బాలిక తొలుత నిరాకరించింది. అయితే పదేపదే కోరడంతో అతడిని నమ్మి ద్విచక్ర వాహనంపై ఎక్కింది.మార్గమధ్యంలో భోజనం చేద్దామని చెప్పగా బాలిక అందుకు నిరాకరించింది. అయినప్పటికీ నిందితుడు ఆమెను రెస్టారెంట్‌కు తీసుకెళ్తానని చెప్పి ఓ హోటల్‌కు తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసే సమయంలో అతడు ప్రవర్తించిన తీరుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు

**లి ముగ్గురు నిందితుల అరెస్ట్.. రూ.91 వేల నకిలీ నోట్లు, కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం**

ఆగస్టు 28, కామారెడ్డి
(హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):
కామారెడ్డి జిల్లాలో నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును పోలీసులు ఛేదించారు. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.91 వేల విలువైన నకిలీ కరెన్సీ, నేరానికి ఉపయోగించిన కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ నెల 26న ఉదయం 10:50 గంటల సమయంలో పిట్లం పోలీస్ స్టేషన్ పరిధిలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌కు నలుగురు వ్యక్తులు స్విఫ్ట్ డిజైర్ కారులో వచ్చారు. రూ.2,000 విలువైన పెట్రోల్ పోయించుకుని, రూ.500 విలువైన నాలుగు నోట్లను అందజేశారు. ఆ నోట్లు నకిలీవని గుర్తించిన పెట్రోల్ బంక్ క్యాషియర్ శ్రీకాంత్ రెడ్డి వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా, నిందితులు కారులో అక్కడి నుంచి పరారయ్యారు.క్యాషియర్ ఫిర్యాదు మేరకు పిట్లం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి పర్యవేక్షణలో బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య,



పిట్లం ఎస్ఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితుల కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు.. నకిలీ కరెన్సీని మరింతగా చలామణి చేసేందుకు హైదరాబాద్‌కు వెళ్తున్న వారిని ధర్మారం టోల్ ప్లాజా సమీపంలో అదుపులోకి తీసుకున్నారు.అరెస్టయిన నిందితులను మహారాష్ట్రలోని పర్భణి జిల్లాకు చెందిన రాహుల్ రావుసాహెబ్ అవాడ్ (23), ప్రతీక్ ధ్యానోబా డాల్వే, భీమ్ శంకర్ రామ్‌రావ్ వైద్యగా పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి రూ.500 విలువైన 182 నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ.91,000గా పోలీసులు తెలిపారు. అదనంగా నేరానికి ఉపయోగించిన స్విఫ్ట్ డిజైర్ కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.దర్యాప్తులో నిందితులు హైదరాబాద్‌లో నకిలీ కరెన్సీని సేకరించి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. నకిలీ కరెన్సీని సరఫరా చేసిన వ్యక్తులతో పాటు ఈ వ్యవహారంలో మరికొందరి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది.నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన బాన్సువాడ రూరల్ సీఐ తిరుపయ్య, పిట్లం ఎస్ఐ ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది శైలేష్, రాము, వెంకటేష్‌లను జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించినట్లు డీఎస్పీ విఠల్ రెడ్డి తెలిపారు.తక్కువ మొత్తంలో అసలు డబ్బులు ఇస్తే రెట్టింపు నకిలీ కరెన్సీ ఇస్తామని చెప్పే వ్యక్తులను నమ్మవద్దని పోలీసులు ప్రజలకు సూచించారు. నకిలీ కరెన్సీని కొనుగోలు చేయడం, కలిగి ఉండడం, చలామణి చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని తెలిపారు. ఇలాంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రాఖీ వేళ వెలసిన ఆత్మీయత.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక

**షేక్ జానీకి రాఖీ కట్టిన తాళ్లూరి గంగాధర్ సోదరి సుజాత**

హైదరాబాద్ పల్స్, ఆగస్టు 28, ఖమ్మం జిల్లా ప్రతినిధి: రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఖమ్మం నగరంలో ఆత్మీయతకు అద్దం పట్టే వేడుక చోటుచేసుకుంది. డోర్నకల్ మండలం ములకలపల్లి గ్రామానికి చెందిన షేక్ జానీకి తాళ్లూరి గంగాధర్ సోదరి చేకూరి సుజాత రాఖీ కట్టి సోదర ప్రేమను చాటుకున్నారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలిపి, సోదరుడు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, నమ్మకానికి రాఖీ పౌర్ణమి ప్రతీకగా నిలుస్తుంది. చిన్ననాటి జ్ఞాపకాల నుంచి జీవితంలోని ప్రతి మలుపులో ఒకరికొకరు అండగా నిలిచే సోదరసోదరీమణుల అనుబంధాన్ని ఈ పండుగ మరింత గుర్తుచేస్తుంది.ఈ నేపథ్యంలో సుజాత తన సోదరుడిగా భావించే షేక్ జానీకి రాఖీ కట్టడం వేడుకకు ప్రత్యేకతను తీసుకొచ్చింది. రాఖీ కట్టిన అనంతరం ఇరువురు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.తాళ్లూరి గంగాధర్‌కు సోదరిగా ఉన్న సుజాత.. ఆయనకు ఆత్మీయుడైన షేక్ జానీకి రాఖీ కట్టడం ద్వారా కుటుంబ అనుబంధాన్ని మరింత చాటుకున్నారు. రక్తసంబంధాలకు అతీతంగా మనసులతో ఏర్పడే ఆత్మీయ బంధాలు కూడా జీవితంలో



ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంటాయనే సందేశాన్ని ఈ వేడుక అందించింది.రాఖీ ముడిలో కనిపించింది కేవలం పండుగ ఆచారం మాత్రమే కాదు.. ప్రేమ, ఆప్యాయత, నమ్మకంతో ముడిపడిన సోదరభావం.

# సర్పంచ్‌కు రాఖీ కట్టిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్




**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 28, నర్సింహులపేట:** రాఖీ పౌర్ణమి సందర్భంగా కౌసల్యాదేవిపల్లి గ్రామ సర్పంచ్ ఎడ్ల శ్రీనివాసరెడ్డికి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. సోదరాభిమానంతో శ్రీనివాసరెడ్డికి రాఖీ కట్టిన సత్యవతి రాథోడ్ ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# రాఖీలు కట్టిన చిన్నారులు.. ఆత్మీయంగా ఆశీర్వదించిన నాయకులు



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 28, నర్సింహులపేట:** రాఖీ పౌర్ణమి సందర్భంగా మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం కౌసల్యాదేవిపల్లి గ్రామంలో చిన్నారులు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రూప్ల తండాకు చెందిన గూగులోత్ నరేష్ - అనసూయ దంపతుల కుమార్తెలు వైష్ణవి, వర్షితలు గ్రామ సర్పంచ్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ బానోత్ రవి, మాజీ ఉపసర్పంచ్ ఎడ్ల సరిత -- శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎడ్ల విష్ణువర్ధన్‌రెడ్డి, వార్డు సభ్యులు కొప్పుల శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పుటూరి కేతమ్మ -- సుబ్బారావులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా నాయకులు చిన్నారులను ఆత్మీయంగా ఆశీర్వదించి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ఆత్మీయ వాతావరణంలో జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

# జర్నలిస్టులకు రాఖీలు కట్టి హెల్మెట్లు పంపిణీ చేసిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



హైదరాబాద్ పల్స్, ఆగస్టు 28, నర్సింహులపేట: రక్షాబంధన్ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ జర్నలిస్టులకు రాఖీలు కట్టి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.హెల్మెట్ వినియోగంపై జిల్లా పోలీసులు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. అనంతరం తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మేకరబోయిన నాగేశ్వర్‌తో పాటు పలువురు పాత్రికేయులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# కురవికి దక్కిన అరుదైన గౌరవం

**జిల్లా ఉపాధ్యాయ సంఘంలో కీలక బాధ్యతలు చేపట్టిన ఐదుగురు**




**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 28, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలానికి చెందిన ఐదుగురు ఉపాధ్యాయ ప్రతినిధులు జిల్లా స్థాయి బాధ్యతలకు ఏకగ్రీవంగా ఎన్నికై మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యాయ సంఘం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వివిధ పదవులకు ఎన్నికలు నిర్వహించగా, కురవి మండలానికి చెందిన ఐదుగురు ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.జిల్లా సహాయ అధ్యక్షుడిగా వి. దామోదర్, జిల్లా ఉపాధ్యక్షులుగా డి. శేఖర్, ఏ. దేవేందర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా టి. సునీత, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఈ. శ్రీధర్ ఎన్నికయ్యారు.మండల స్థాయిలో ఉపాధ్యాయ సంఘం కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వీరికి జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు దక్కడం పట్ల కురవి మండల ఉపాధ్యాయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉపాధ్యాయుల సమస్యలను జిల్లా స్థాయిలో బలంగా వినిపించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఉపాధ్యాయుల ఐక్యత, సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు.నూతనంగా ఎన్నికైన ప్రతినిధులకు కురవి మండల శాఖ అధ్యక్షుడు వెంపటి సీతారాములు, ప్రధాన కార్యదర్శి ఆకుతోట శివప్రసాద్ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# ఈటల రాజేందర్‌కు రాఖీ కట్టిన సరిత రావు


**రక్షాబంధన్ సందర్భంగా సోదరాభిమానాన్ని చాటుకున్న బీజేపీ నాయకురాలు**



ఆగస్టు 28, హైదరాబాద్ (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):
రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ నేత ఈటల రాజేందర్‌కు బీజేపీ నాయకురాలు సరిత రావు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్‌కు రాఖీ కట్టి సోదరాభిమానాన్ని చాటుకున్నారు.రక్షాబంధన్ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని సరిత రావు పేర్కొన్నారు. ప్రజా సేవలో ఈటల రాజేందర్ మరింత విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం ఈటల రాజేందర్ కూడా సరిత రావుకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

# రాఖీతో బలపడిన అన్నాచెల్లెళ్ల అనుబంధం

**ప్రేమానురాగాల మధ్య రక్షాబంధన్ వేడుక**



ఆగస్టు 28, (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):
రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో శుక్రవారం చిన్నారులు ఆనందోత్సాహాల మధ్య రాఖీ పండుగను జరుపుకున్నారు.ఈ సందర్భంగా చిన్నారి సమీరా తన అన్నయ్య కొండపల్లి పవన్‌కుమార్‌కు ఆప్యాయంగా రాఖీ కట్టి సోదరబంధాన్ని చాటుకుంది. అనంతరం పవన్‌కుమార్ తన చెల్లెలిని ఆశీర్వదించి, ప్రేమగా మిఠాయి తినిపించాడు.చిన్నారుల మధ్య జరిగిన ఈ రాఖీ వేడుక ప్రేమ, ఆప్యాయత, నమ్మకానికి ప్రతీకగా నిలిచింది. రాఖీ కట్టిన ఆనందంతో చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు వెల్లివిరిశాయి. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ రక్షాబంధన్ పండుగను సంతోషంగా జరుపుకున్నారు.

# ఢిల్లీలో గూఢచర్యం ఆరోపణలు.. దుబాయ్ మీదుగా పాకిస్తాన్‌కు సిమ్ కార్డులు

**పాక్ హ్యాండ్లర్లతో 2024 నుంచి సంబంధాలు.. దంపతుల అరెస్ట్**



న్యూఢిల్లీ, ఆగస్టు 28 (హైదరాబాద్ పల్స్ న్యూస్): భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరవేస్తున్నారనే ఆరోపణలపై ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం ఓ దంపతులను అరెస్ట్ చేసింది. మహమ్మద్ సాహిల్, ఆయన భార్య సమీరాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. 2024 నుంచి వీరు పాకిస్తాన్‌కు చెందిన వ్యక్తులతో సామాజిక మాధ్యమాల ద్వారా సంబంధాలు కొనసాగిస్తూ గూఢచర్య కార్యకలాపాలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. 2024లో సాహిల్‌కు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పాకిస్తాన్‌కు చెందిన ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అనంతరం ఆ పరిచయం క్రమంగా గూఢచర్య కార్యకలాపాలకు దారితీసినట్లు దర్యాప్తులో గుర్తించారు. సాహిల్‌తో పాటు ఆయన భార్య సమీరా కూడా పాక్ హ్యాండ్లర్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ భారత రక్షణ విభాగాలకు సంబంధించిన, స్థానికంగా సున్నితమైన సమాచారాన్ని అందించడంలో సహకరించినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు.

**దుబాయ్ మీదుగా సిమ్ కార్డుల తరలింపు**

2024 నుంచి 2025 మధ్యకాలంలో ఈ దంపతులు ఎనిమిది భారతీయ సిమ్ కార్డులను సేకరించినట్లు పోలీసులు తెలిపారు. వాటిని దుబాయ్ మీదుగా పాకిస్తాన్‌లోని తమ హ్యాండ్లర్లకు పంపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఆ సిమ్ కార్డులను ఉపయోగించి పాక్ ఏజెంట్లు భారత్‌లో వాట్సాప్ ఖాతాలను సృష్టించి, స్థానిక సమూహాల్లో చేరి సమాచారాన్ని సేకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు.నిందితుల నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. వాటిలోని సంభాషణలు, చాటింగ్‌లు, ఇతర డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే కొన్ని ఆధారాలను ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపినట్లు సమాచారం.

**మరెవరైనా ఉన్నారా?**

ఈ గూఢచర్య వ్యవహారంతో సంబంధం ఉన్న మరికొందరు వ్యక్తులు ఉన్నారా? ఆర్థిక లావాదేవీలు ఏ మార్గాల్లో జరిగాయి? భారత్‌లో నిందితులకు మరెవరైనా సహకరించారా? అనే కోణాల్లో ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం దర్యాప్తు కొనసాగిస్తో

# శత్రు దేశాలకు షాక్.. సముద్ర గర్భంలో భారత్ 'నిపుణ్' ఎంట్రీ!

**స్వదేశీ సాంకేతికతతో నిర్మాణం.. ఆగస్టు 31న నావికాదళంలోకి ప్రవేశం**



విశాఖపట్నం, ఆగస్టు 28 (హైదరాబాద్ పల్స్ న్యూస్):
భారత నావికాదళం అండర్‌వాటర్ కార్యకలాపాల్లో మరింత సామర్థ్యాన్ని పెంచుకునేందుకు మరో కీలక నౌక అందుబాటులోకి రానుంది. దేశీయంగా రూపకల్పన చేసి నిర్మించిన రెండో డైవింగ్ సపోర్ట్ వెసెల్ (డీఎస్‌వీ) 'నిపుణ్' ఆగస్టు 31న అధికారికంగా భారత నావికాదళంలోకి ప్రవేశించనుంది.విశాఖపట్నంలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ స్వదేశీ సాంకేతికతతో ఈ నౌకను నిర్మించింది. సముద్ర గర్భంలో అత్యంత క్లిష్టమైన కార్యకలాపాలు, నీటి అడుగున పరిశోధనలు, డైవింగ్ కార్యకలాపాలకు సహకరించేలా నిపుణ్‌ను రూపొందించారు.

**డైవర్లకు అత్యాధునిక సహకారం**

సముద్రంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ డైవర్లు సురక్షితంగా విధులు నిర్వహించేందుకు నౌకలో ఆధునిక వ్యవస్థలను ఏర్పాటు చేశారు. నీటి అడుగున వివిధ పరిశోధనలు, రక్షణ చర్యలకు కూడా ఈ నౌక సహకరించనుంది.ముఖ్యంగా ప్రమాదంలో చిక్కుకున్న జలాంతర్గాములను రక్షించే జలాంతర్గామి రక్షణ చర్యల్లో నిపుణ్ కీలక పాత్ర పోషించనుంది. సముద్ర గర్భంలో జరిగే సంక్లిష్టమైన కార్యకలాపాలకు ఇది ప్రధాన వేదికగా ఉపయోగపడనుంది.

**అధునాతన వ్యవస్థల ఏర్పాటు**

నౌకలో నావిగేషన్, వేదిక నిర్వహణ, సముద్రంలో నిర్దిష్ట ప్రాంతంలో స్థిరంగా ఉండే సామర్థ్యాన్ని అందించే ఆధునిక వ్యవస్థలను ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన వైద్య సదుపాయాలను కూడా ఇందులో కల్పించారు.హిందూ మహాసముద్ర ప్రాంతంలో భారత నావికాదళం చేపట్టే నీటి అడుగున కార్యకలాపాలకు నిపుణ్ నౌక మరింత బలాన్ని అందించనుంది. దేశీయంగా రక్షణ రంగ నౌకల నిర్మాణ సామర్థ్యం పెరుగుతున్నదానికి ఈ నౌక మరో ఉదాహరణగా నిలవనుంది.

# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

**నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన అధికారులు.. భద్రత, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి**





ఆగస్టు 28, కొంపల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):
రానున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు ఏర్పాట్లపై దృష్టి సారించారు. నిమజ్జన ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అధికారులు కొంపల్లి చెరువు, దూలపల్లి చెరువులను సందర్శించారు.కొంపల్లి సిఎంసి ఉప కమిషనర్ లావణ్య, జీహెచ్ఎంసీ కొంపల్లి డీఈ విరాట్, పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ, సీఐ విజయ్ వర్ధన్, ఎస్సై రాజుతో పాటు సంబంధిత అధికారులు నిమజ్జన ప్రాంతాలను పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్ల ఏర్పాటు, బారికేడింగ్, విద్యుత్, వెలుగుల సదుపాయం, రహదారుల పరిస్థితి, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ తదితర అంశాలను పరిశీలించారు. పోలీసు బందోబస్తు, అత్యవసర సేవలు, భక్తులు, ప్రజల భద్రతకు అవసరమైన మౌలిక సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు.నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జీహెచ్ఎంసీ, పోలీసు శాఖతో పాటు ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.భక్తులు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు అధికారులకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేలా సహకరించాలని అధికారులు కోరారు.

# గ్రాండ్ చెస్ టూర్‌లో చరిత్ర సృష్టించిన ప్రజ్ఞానంద..తొలి భారతీయుడిగా ఘనత



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, సెంట్రల్ డెస్క్ :** చెస్ ప్రపంచంలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రతిష్ఠాత్మక గ్రాండ్ చెస్ టూర్ ఫైనల్స్ టైటిల్‌ను సొంతం చేసుకొని ఆ ఘనత సాధించిన మొట్టమొదటి భారతీయుడిగా రికార్డుకెక్కాడు.అమెరికాలోని సెయింట్ లూయిస్ లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వరల్డ్ నంబర్ 2 ఫ్యాబియానో కరువానా పై ఈ చెన్నై గ్రాండ్‌మాస్టర్ అద్భుతమైన విజయం సాధించాడు. అంతకు ముందు జరిగిన తొలి క్లాసిక్ గేమ్‌లో ప్రజ్ఞా కరువానాపై ఓటమి చవిచూశాడు. 6-0 తేడాతో ఓడిపోయాడు. ఆ తర్వాత రెండో క్లాసిక్ గేమ్‌ను 3-3 పాయింట్లతో డ్రా చేసుకున్నాడు. వరుసగా రెండు ర్యాపిడ్ గేమ్‌లలో అద్భుతంగా రాణించి ఆధిక్యంలోకి వచ్చాడు. ఫైనల్స్‌లో అద్భుతమైన కమ్‌బ్యాక్‌తో కరువానాపై 15-13 తేడాతో విజయం సాధించాడు.ఈ విజయంతో గ్రాండ్ చెస్ టూర్ టైటిల్‌ను సాధించిన తొలి భారతీయుడిగా ప్రజ్ఞానంద తన పేరును చరిత్రలో లిఖించుకున్నాడు. ఛాంపియన్‌గా నిలిచిన అతడికి దాదాపు రూ.2 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది. అంతేకాకుండా ఈ విజయంతో వచ్చే ఏడాది జరగనున్న గ్రాండ్ చెస్ టూర్‌లో నేరుగా పాల్గొనే అర్హతను కూడా ప్రజ్ఞానంద సొంతం చేసుకున్నాడు. ఇక ఈ విజయం తర్వాత చెన్నై గ్రాండ్ మాస్టర్ మాట్లాడుతూ.. ఆరు పాయింట్లు వెనుకబడి ఉండటంతో ఫైనల్ మ్యాచ్‌లో గెలుస్తానన్న ఆశ తనకు లేదని చెప్పారు. ఫాబీపై ఒక్క మ్యాచ్ గెలవడమే కష్టమని చెప్పారు. అలాంటిది ర్యాపిడ్‌లో రెండు గేమ్స్‌లో విజయం సాధించినట్లు తెలిపారు.

# ఊర చెరువుపై రియల్ దందా?

### ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ భూములపై కబ్జా ఆరోపణలు.. సర్వే నంబర్లపై అధికారుల నిఘా ఏది?


ఆగస్టు 28, కొంపల్లి (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):
కొంపల్లి శివారులోని ఊర చెరువు భూములపై ఆక్రమణల ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. చెరువు పరిధిలోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ భూములను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి వెంచర్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువుకు సంబంధించిన సర్వే నంబర్లు 24, 25, 26, 27, 42 పరిధిలోని భూములపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఆయా సర్వే నంబర్లలో ప్రస్తుతం భూముల పరిస్థితి ఏమిటి? ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధులు ఎక్కడివరకు ఉన్నాయి? అక్కడ నిర్మాణాలు లేదా ఇతర అభివృద్ధి పనులకు అనుమతులు ఇచ్చారా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు**

చెరువు భూములను పరిరక్షించాల్సిన అధికార యంత్రాంగం ఉన్నప్పటికీ ఆక్రమణల ఆరోపణలు రావడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అంటున్నారు. అధికారుల పర్యవేక్షణలోనే చెరువు పరిధిలోని భూములు చేతులు మారుతున్నాయా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో అనధికార కార్యకలాపాలు జరిగితే భవిష్యత్తులో వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడి వరద ముప్పు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాంటి పరిస్థితుల్లో బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు.

**సంయుక్తంగా పరిశీలన చేపట్టాలని డిమాండ్**

ఇప్పటికైనా నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి సంబంధిత భూ రికార్డులు, సర్వే వివరాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులను అధికారికంగా గుర్తించి, ఆక్రమణలు లేదా అనధికార



నిర్మాణాలు ఉన్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఊర చెరువు భూముల పరిరక్షణపై అధికారులు ఎప్పుడు స్పందిస్తారు? ఆక్రమణల ఆరోపణలపై సమగ్ర విచారణ చేపడతారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# వరదల్లో మృతదేహాలపైనా దొంగల కన్ను

**మృత మహిళ చెవి కమ్మలు అపహరిస్తున్న వీడియో వైరల్..**

**ఇద్దరిని అరెస్ట్ చేసిన నేపాల్ పోలీసులు.**

హైదరాబాద్ పల్స్, ఆగస్టు 28:
నేపాల్‌లో ఇటీవల సంభవించిన ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా పలు ప్రాంతాలు నీటమునగడంతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. వందలాది మంది మృతి చెందగా, పలువురి ఆచూకీ ఇంకా లభించాల్సి ఉంది. మరోవైపు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విషాద సమయంలో మృతదేహాలపై ఉన్న విలువైన వస్తువులను అపహరిస్తున్న ఘటనలు వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. వరదల్లో మృతి చెందిన ఓ మహిళ మృతదేహం నుంచి చెవి కమ్మలను




తొలగిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. వీడియో ఆధారంగా దర్యాప్తు చేపట్టిన నేపాల్ పోలీసులు మదన్ గురుంగ్ (25), ఉమేష్ చౌదరి (38) అనే ఇద్దరిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు సమాచారం. భరత్‌పూర్‌లోని పోఖరా బస్ పార్క్ సమీపంలో వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. వరదలతో కుటుంబ సభ్యులను కోల్పోయి బాధలో ఉన్న సమయంలో మృతదేహాల నుంచి ఆభరణాలు అపహరించడం పట్ల స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొట్టడంతో పోలీసులు స్పందించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

# క్యాలెండర్ మాట వినని రుతుపవనాలు

**మారుతున్న వర్షపాత సరళితో వ్యవసాయానికి కొత్త సవాళ్లు..**

**ఎల్‌నినో ప్రభావంతో పెరుగుతున్న అసమానతలు**

హైదరాబాద్ పల్స్, ఆగస్టు 28:
భారతదేశంలో రుతుపవనాల తీరు క్రమంగా మారుతోంది. సాధారణంగా నిర్ణీత కాలంలో ప్రారంభమై దేశవ్యాప్తంగా విస్తరించే వర్షాలు ఇప్పుడు ఎప్పుడు వస్తాయో, ఎక్కడ కురుస్తాయో అంచనా వేయడం కష్టంగా మారుతోంది. ఒక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండగా, మరో ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయి. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం గత దశాబ్దాలతో పోలిస్తే దేశంలోని పలు ప్రాంతాల్లో రుతుపవనాల రాకలో ఆలస్యం కనిపిస్తోంది. దక్షిణ, తూర్పు ప్రాంతాల్లో కొన్ని రోజుల ఆలస్యం ఉండగా, ఈశాన్య, వాయవ్య ప్రాంతాల్లో మరింత ఎక్కువగా ఆలస్యం నమోదవుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. అదే




సమయంలో రుతుపవనాల నిష్క్రమణ కూడా ఆలస్యమవుతోంది. వర్షాకాలం ఎక్కువ రోజులు కొనసాగడం రైతులకు మరో సమస్యగా మారుతోంది. పంటలు చేతికొచ్చే సమయంలో కురిసే భారీ వర్షాలతో కోతకు సిద్ధమైన పంటలు దెబ్బతింటున్నాయి. మరోవైపు వర్షాలు ఆలస్యమైతే విత్తనాలు వేయడం, నాట్లు వేయడం వంటి వ్యవసాయ పనులపై ప్రభావం పడుతోంది. దేశ వార్షిక వర్షపాతంలో అధిక భాగం నైరుతి రుతుపవనాల ద్వారానే లభిస్తుంది. వ్యవసాయంపై ఆధారపడే కోట్లాది మంది ప్రజల జీవనోపాధి రుతుపవనాలపైనే ఆధారపడి ఉంది. వర్షాల సరళిలో మార్పులు వ్యవసాయంతో పాటు నీటి నిల్వలు, పంట దిగుబడులు, ఆహార ధరలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది.

**ఎల్‌నినోతో పాటు ఇతర కారణాలు**

ప్రశాంత మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఏర్పడే ఎల్‌నినో ప్రభావం రుతుపవనాలపై ప్రభావం చూపే ప్రధాన కారణాల్లో ఒకటిగా నిపుణులు పేర్కొంటున్నారు. దీనికి తోడు గాలుల వేగంలో మార్పులు, సముద్ర ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు, హిందూ మహాసముద్రంలోని వాతావరణ పరిస్థితులు కూడా వర్షపాత సరళిని ప్రభావితం చేస్తున్నాయి. మొత్తంగా మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు, నీటి నిర్వహణ, పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం పెరుగుతోంది. రుతుపవనాలు క్యాలెండర్‌ను అనుసరించకుండా మారుతున్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళికలే రైతులకు రక్షణగా నిలవనున్నాయి.

## జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో

# డాక్టర్ల గైర్హాజరు.. మంత్రి దామోదర్ సీరియస్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, జహీరాబాద్:**
జహీరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో డ్యూటీ వైద్యులు గైర్హాజరైన ఘటనపై తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో వైద్యుల కొరత, డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడం, ప్రైవేటు వైద్యుడితో చికిత్స అందించినట్లు వచ్చిన వార్తలపై మంత్రి స్పందించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి దామోదర్ చర్చించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించాల్సిన వైద్యులు గైర్హాజరు కావడం, రోగులకు ఇబ్బందులు కలగడం వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించారు. డ్యూటీ సమయంలో వైద్యులు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేద, సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు.



# రాఖీ బంధంతో రాజకీయ అనుబంధానికి మరింత బలం

**మన్యు పాట్నికి రాఖీ కట్టిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్**

**ఆగస్టు 28, మహబూబాబాద్ జిల్లా (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):**



రాఖీ పౌర్ణమి సందర్భంగా మహబూబాబాద్ జిల్లాలో ఆత్మీయత, సోదరభావం వెల్లివిరిసింది. డోర్నకల్ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, తన ప్రధాన అనుచరుడైన మన్యు పాట్నికి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ రాఖీ కట్టి సోదరాభిమానాన్ని చాటుకున్నారు. రాఖీ పండుగ సందర్భంగా నిర్వహించిన ఈ ఆత్మీయ కార్యక్రమం కుటుంబ అనుబంధానికి ప్రతీకగా నిలిచింది. సోదరుడి క్షేమాన్ని కోరుతూ సోదరి రాఖీ కట్టడం భారతీయ సంప్రదాయంలో ప్రత్యేకతను కలిగి ఉండగా, అదే ఆత్మీయతను ప్రతిబింబించేలా సత్యవతి రాథోడ్ మన్యు పాట్నికి రాఖీ కట్టారు. డోర్నకల్ నియోజకవర్గ రాజకీయాల్లో సత్యవతి రాథోడ్‌కు మన్యు పాట్ని ప్రధాన అనుచరుడిగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ రాఖీ వేడుకకు రాజకీయంగానూ ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సందర్భంగా ఇద్దరూ పరస్పరం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సోదరసోదరీమణుల అనుబంధం, ఆత్మీయత ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

# రక్తసంబంధానికి అతీతంగా.. ఆత్మీయతను చాటిన రాఖీ బంధం

హైదరాబాద్ పల్స్, ఆగస్టు 28, డోర్నకల్ :



రాఖీ పౌర్ణమి సందర్భంగా మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామంలో ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ వేడుక జరిగింది. మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పసుపులేటి కళావతి జర్నలిస్ట్ సతీష్‌కు రాఖీ కట్టి సోదర బంధాన్ని చాటుకున్నారు. అనంతరం సోదర భావంతో ఆశీస్సులు అందించారు. రక్తసంబంధం లేకపోయినా మనసులు కలిసిన చోట ఏర్పడే అనుబంధం ఎంతో గొప్పదని ఈ సందర్భంగా కళావతి పేర్కొన్నారు. కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలవడం, ఆప్యాయతను పంచుకోవడం, పరస్పర గౌరవంతో మెలగడమే రాఖీ బంధం యొక్క అసలైన స్ఫూర్తి అని అన్నారు. రాఖీ కేవలం చేతికి కట్టే దారం కాదని, నమ్మకం, ఆప్యాయత, ఆత్మీయతలకు ప్రతీకగా నిలిచే పవిత్ర బంధమని తెలిపారు. రక్తసంబంధాలకంటే కూడా కొన్ని అనుబంధాలు మరింత బలంగా నిలుస్తాయని, అలాంటి మానవీయ బంధాలను గుర్తు చేసేదే రాఖీ పౌర్ణమి అని పేర్కొన్నారు. వెన్నారంలో జరిగిన ఈ రాఖీ వేడుక ఆత్మీయతకు ప్రతీకగా నిలిచింది.

# ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు రాఖీలు కట్టిన మహిళా సోదరీమణులు

**రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీక: ఎమ్మెల్యే శ్రీగణేష్**

ఆగస్టు 28, పికెట్ (హైదరాబాద్ పల్స్ ప్రతినిధి):



రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన మహిళలు ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను ఆయన నివాసంలో కలిసి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యేతో ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళలు తనపై చూపిన ప్రేమాభిమానాలు ఎంతో సంతోషాన్ని కలిగించాయని తెలిపారు. మహిళల భద్రత, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని శ్రీగణేష్ పేర్కొన్నారు. మహిళలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాఖీలు కట్టిన మహిళలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే.. ప్రతి ఒక్కరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

# యూత్ కాంగ్రెస్ బలోపేతానికి నిమ్మల శ్రీనివాస్ కృషి

**ఘనంగా జన్మదిన వేడుకలు.. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు**



**హైదరాబాద్ పల్స్, ఆగస్టు 28, నర్సింహులపేట:**
నర్సింహులపేట మండల కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, సర్పంచ్ పెదమాముల యాకయ్య, ఉప సర్పంచ్ కాసా యాకయ్యతో పాటు నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యూత్ కాంగ్రెస్ బలోపేతానికి శ్రీనివాస్ చేస్తున్న కృషిని అభినందించారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పొన్నం శ్రీకాంత్, నాయకులు అలవాల శ్రీను, ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ వెంకన్న, నరసయ్య, పాషా తదితరులు పాల్గొన్నారు.

# బేగంపేటలో పద్మశాలీల ఆధ్వర్యంలో గాయత్రి హోమం



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం బేగంపేట గ్రామంలో జంధ్యాల పౌర్ణమి సందర్భంగా పద్మశాలీలు గాయత్రి హోమం నిర్వహించారు. అనంతరం మూకుమ్మడి గాయత్రి (జంధ్యం) ధరించారు ఇట్టి గాయత్రి హోమ కార్యక్రమాన్ని పద్మ బ్రాహ్మణులు నల్ల విష్ణు పంతులు చెడుదీపు కృష్ణ పంతులు నిర్వహించారు. ఈ సందర్భంగా బేగంపేట పద్మశాలి సంఘం అధ్యక్షులు పెంట గోపాల్ మాట్లాడుతూ, హోమం జరిపించడం గాయత్రీ జంధ్యం ధరించడం పద్మశాలిలకు అనాదిగా వస్తున్న ఆచారం అని తెలియజేశారు. అలాగే గాయత్రీ మాత కృప కటాక్షాలు పద్మశాలీలకు ఎల్లవేళలా ఉండాలని పద్మశాలీలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని గాయత్రీ మాతను కోరిన్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బేగంపేట పద్మశాలి కులస్తులు పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు

# రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, బీర్ల అనిత



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి బీర్ల అనిత రాఖీ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ఆడపడుచులు, మహిళలు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకి రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఆప్యాయత, అనురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా ఆడపడుచులు చూపిన ప్రేమాభిమానాలకు బీర్ల ఐలయ్య కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత అన్నదమ్ములకు స్వయంగా రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయత, అనుబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. రాఖీ పౌర్ణమి పండుగ ప్రతి కుటుంబంలో సంతోషాలను నింపాలని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఆప్యాయతలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

# ఆర్ఎస్ఎస్ మార్చ్‌లో పాల్గొన్న ప్రభుత్వ ఉపాధ్యాయులు.. సస్పెండ్ చేసిన సర్కార్



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, కర్ణాటక డెస్క్ :
ఆర్ఎస్ఎస్ కవాతులో పాల్గొన్న ఇద్దరు ఉపాధ్యాయులపై కర్ణాటక ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటూనే నిబంధనలను ఉల్లంఘించి ఆర్ఎస్ఎస్ పథ సంచలనలో పాల్గొన్నందుకుగాను వారిపై వేటు వేసింది. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన పథ సంచలనలో యాద్‌గిర్ జిల్లా హుణసగి బాలికల ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన గురురాజ జోషి, కుప్పి ప్రభుత్వ జూనియర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అణ్ణాసాహెబ్ దేశ్‌ముఖ్ పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ దుస్తూలు ధరించి కవాతు చేశారు. వారి ఇద్దరిపై అంబేద్కర్ స్వాభిమాని సేన జిల్లా అధ్యక్షుడు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన అధికారులు వారిద్దరు రూట్ మార్చ్‌లో పాల్గొన్నట్లు తేలింది. ఇది కర్ణాటక సివిల్ సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ 2021 నిబంధనలకు విరుద్ధమని ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ యాద్‌గిర్ జిల్లా విద్యాశాఖ అధికారి చన్నబసప్ప ఉత్తర్వులు జారీచే శారు.

**పంచాయతీ అధికారిపై కూడా..**

ఆర్ఎస్ఎస్ రూట్ మార్చ్‌లో పాల్గొన్న మరో అధికారిపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. గతేడాది అక్టోబర్ 12న రాయచూరు జిల్లా లింగసుగూర్‌లో జరిగిన కవాతులో సిర్వార్ తాలూకా పంచాయతీ అభివృద్ధి అధికారి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ యూనిఫాం ధరించి, కర్ర చేతపట్టుకుని రూట్ మార్చ్‌లో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేశారు.





# యజ్ఞోపవీతం ధరించిన రేణికుంట పద్మశాలీలు

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :
యాదాద్రి భువనగిరి జిల్లా, రాజపేట మండలం రేణికుంట గ్రామంలో జంధ్యాల పౌర్ణమి సందర్భంగా పద్మశాలీలు మూకుమ్మడి గాయత్రి (జంధ్యం) యజ్ఞోపవీతం ధరించారు ఇట్టి గాయత్రి జంధ్యం యజ్ఞోపవీతం కార్యక్రమాన్ని పద్మ బ్రాహ్మణులు రేగొండ పాండురంగం పంతులు నిర్వహించారు. ముందుగా గణపతి మార్కండేయ స్వామి పూజ నిర్వహించుకొని తదనంతరం శ్రీ గాయత్రి నవతంతు దేవతా ఆవ్హానం చేసి షోడశ ఉపచార పూజ నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా రేణికుంట పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు భోగ కృష్ణ మూర్తి మాట్లాడుతూ...గాయత్రీ జంధ్యం ధరించడం పద్మశాలిలకు అనాదిగా వస్తున్న ఆచారం అని తెలియజేశారు. అలాగే గాయత్రీ మాత కృప కటాక్షాలు పద్మశాలీలకు ఎల్లవేళలా ఉండాలని పద్మశాలీలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని గాయత్రీ అమ్మవారిని కోరిన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణికుంట పద్మశాలి కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. తదనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేయడం జరిగింది.

# రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, బీర్ల అనిత



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ శ్రీమతి బీర్ల అనిత రాఖీ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ఆడపడుచులు, మహిళలు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకి రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శు భాకాంక్షలు తెలిపారు. ఆప్యాయత, అనురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా ఆడపడుచులు చూపిన ప్రేమాభిమానాలకు బీర్ల ఐలయ్య కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత అన్నదమ్ములకు స్వయంగా రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శు భాకాంక్షలు తెలిపారు. సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, ఆత్మీయత, అనుబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. రాఖీ పౌర్ణమి పండుగ ప్రతి కుటుంబంలో సంతోషాలను నింపాలని, అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఆప్యాయతలు ఎల్లప్పుడూ ఇలాగే కొనసాగాలని వారు ఆకాంక్షించారు.

# దూరం ఎంతైనా.. సోదర బంధం చెరగదు

**హైదరాబాద్ నుంచి డోర్నకల్‌కు చేరుకున్న రేఖ పాండే..**
**నలుగురు అన్నదమ్ములకు రాఖీలు**



హైదరాబాద్ పల్స్, ఆగస్టు 28, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :
రాఖీ పౌర్ణమి సందర్భంగా డోర్నకల్ పట్టణంలోని కాలా సుమేర్ జైన్ నివాసంలో కుటుంబ సభ్యుల మధ్య ప్రేమానురాగాలు వెల్లివిరిశాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆయన సోదరి రేఖ పాండే తన అన్నదమ్ములైన కాలా సుమేర్ జైన్, మనోజ్ జైన్, ఆనంద్ జైన్, సుశీల్ కుమార్ జైన్‌లకు, వారి సతీమణులకు సంప్రదాయంగా రాఖీలు కట్టి సోదర ప్రేమను చాటుకున్నారు. రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రతి ఏడాది హైదరాబాద్ నుంచి డోర్నకల్‌కు రావడం, తన అన్నదమ్ములకు రాఖీలు కట్టడం రేఖ పాండేకు ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా అన్నదమ్ముల కుటుంబాలు సోదరిని ఆప్యాయంగా స్వాగతించగా, రాఖీ కట్టిన అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రక్తసంబంధం కేవలం బంధుత్వానికే పరిమితం కాకుండా ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, ఆత్మీయతలతో మరింత బలపడుతుందనే సందేశాన్ని ఈ వేడుక చాటిచెప్పింది. కుటుంబ సభ్యులంతా కలిసి రాఖీ పౌర్ణమి వేడుకలను ఆనందంగా జరుపుకోవడంతో ఇంటిల్లిపాదిలో పండుగ వాతావరణం నెలకొంది.

# పల్లెర్లలో ఘనంగా 28వ వి.ఎచ్.పి.యస్ ఆవిర్భావ దినోత్సవం

**మంద కృష్ణ మాదిగ పోరాటంతోనే వికలాంగుల జీవితాల్లో వెలుగులు**

**వి.ఎచ్.పి.యస్ జిల్లా కో కన్వీనర్ లోడి ధనుంజయ్య గౌడ్**

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆలేరు నియోజకవర్గం పల్లెర్ల వి.ఎచ్.పి.యస్ 28వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ముఖ్య అతిథిగా వి.ఎచ్.పి.యస్ యాదాద్రి భువనగిరి జిల్లా కో కన్వీనర్ లోడి ధనుంజయ్య గౌడ్ హాజరై జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం మాట్లాడుతూ... పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పోరాటాల ఫలితం వికలాంగుల, వితంతువు, వృద్ధుల పెన్షన్లు పెరిగాయి. వికలాంగులకు పెన్షన్లు నాలుగువేల నుండి ఆరువేలకు వృద్ధుల వితంతువులు పెన్షన్ నలుగు వేలకు పెంచుతానని హామీ ఇచ్చి ఇప్పటివరకు వికలాంగుల, వితంతువుల, వృద్ధులకు గాని పెన్షన్ పెంచలేదు ఇవ్వలేదు ఇకనైనా వికలాంగుల వృద్ధులు వితంతువులకు పెన్షన్లు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పియస్ ఆధ్వర్యంలో వి.ఎచ్.పి.యస్ జిల్లా కో కన్వీనర్ లోడి ధనుంజయ్య గౌడ్ కి మిఠాయిలు తినిపించడం జరిగింది. ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి భవిష్యత్ పోరాటల్లో వి.ఎచ్.పి.యస్ కు వెన్నుదన్నుగా ఎమ్మార్పియస్ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలోఎమ్మార్పీఎస్ ఆలేరు నియోజకవర్గం ఇంచార్జీ నల్ల చంద్ర స్వామి మాదిగ, వి.ఎచ్.పి.యస్ నాయకులు గుంటి దామోదర్, తండ వెంకటేష్, ఎమ్మార్పియస్ నాయకులు మేడి రామ్ లక్ష్మణ్, జన్నపాల శేఖర్, కొమ్ము మత్స్యగిరి, కొమ్ము రాజు, ముత్తయ్య,




వస్తుపుల జంగులు, మోత్కూర్ శేఖర్, మేడి రవి, జన్నపాల నరేష్, కొమ్ము సంతోష్, ఎడ్ల నవీన్, మేడి చరణ్, మేడి అర్జున్, ఎడ్ల శివకుమార్, మోత్కూర్ నవీన్, వస్తుపుల నవీన్, కొమ్ము సంపత్, మేడి నగేష్, ఎడ్ల సంజీవ,మేడి ఆనంద్, వస్తుపుల పాపయ్య, మేడి నర్సింగ్ రావ్, ఎడ్ల సహదేవ్, వస్తుపుల మల్లేష్ , సంగపాక నవీన్, మేడి నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించిన వామపక్ష పార్టీల నేతలు


హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : 2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా విప్లవ, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, అన్ని వర్గాల ప్రజలు సాగించిన వీరోచిత పోరాటంలో నరహంతక చంద్రబాబు నాయుడు ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో రామకృష్ణ, బాలస్వామి , విష్ణువర్ధన్ లు ముగ్గురు అమరులయ్యారని, విద్యుత్ పోరాటం, ముగ్గురు వీరులు అమరులవ్వడంతో నాటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కుప్పకూలిందని సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్, సీపీఎం సీనియర్ జిల్లా నాయకులు మొరిగాడి చంద్రశేఖర్ లు అన్నారు. శుక్రవారం ఆలేరులో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ముందు విద్యుత్ అమరవీరుల ఫోటో లకు పూలమాలలు వేసి ఘనంగా విప్లవ జోహార్లు, నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనార్ధన్, వెంకటేష్, చంద్రశేఖర్ లు మాట్లాడుతూ, విపరీతంగా పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ,అదే విధంగా మరో సందర్భంలో అంగవాడీ కార్మికులను పర్మనెంట్ చేయాలని ,



సౌకర్యాలు మెరుగుపరచాలని, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పోరాడిన అంగన్వాడీ లపై గుర్రాలతో తొక్కించిన చంద్రబాబు నాయుడు మహిళా కార్మిక వ్యతిరేకి అని, విద్యుత్ చార్జీలను తగ్గించాలని పోరాడిన ప్రజలపై పోలీస్ కాల్పులు జరిపించిన నరహంతకుడు చంద్రబాబు నాయుడు అని తీవ్రంగా విమర్శించారు. నాడు చంద్రబాబు, నేడు బీజేపీ మోడీ ప్రభుత్వం కేంద్రంలో విద్యుత్ సంస్కరణలను ముందుకు తెచ్చి, మోటార్లకు మీటర్లను బిగించే ప్రయత్నంలో ఉన్నదని, విత్తన బిల్లు, స్వేచ్చా వాణిజ్య ఒప్పందం పేరుతో దేశ వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని బలహీనపర్చడంతో పాటు, దేశీయ ఉత్పత్తులనింటిని పాతరేసే దుర్మార్గమైన పాలన నేడు దేశంలో కొనసాగుతున్నదని అన్నారు. పూర్తిగా విదేశీ వస్తువులపై ననే ఆధారపడే విధంగా దేశ విద్రోహకర, బడా కార్పోరేట్ సంస్థలకు అనుకూలమైన విధానాలను అమలు చేస్తున్నదని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన అనేక వాగ్దానాలను మూడేండ్లు గడిచినప్పటికి అమలుచేయలేక పోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, సీపీఎం మండల నాయకులు వడ్డేమాన్ బాలరాజు, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్, ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మామిడాల బాల మల్లేష్, అరుణోదయ జిల్లా నాయకులు ఇక్కిరి శ్రీనివాస్, సీపీఎం మండల నాయకులు గణగాని మల్లేష్, ఖలీల్, ఎం.డీ.పతీన్, సీపీఐ మండల నాయకుడు గిరబోయిన స్వామి,ప్రజా సంఘాల నాయకులు కుర్రి సత్యనారాయణ,బుడిగె లక్ష్మయ్య, గుజ్జ పాండు, నమిలే అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో' నేరగాడికి మళ్లీ పాఠశాలలో ఉద్యోగం..
# 22 మంది బాలికలను లైంగికంగా వేధించిన కుక్!

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, సెంట్రల్ డెస్క్:
మహారాష్ట్రలోని థానే జిల్లాలో తీవ్ర కలకలం రేపిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఓ గిరిజన పాఠశాలలో పనిచేస్తున్న వంట మనిషి 22 మంది బాలికలను లైంగికంగా వేధించినట్లు ఆరోపణలు వచ్చాయి. విద్యార్థినులు భోజనం కోసం వెళ్లే సమయంలో వారిని అసభ్యంగా తాకుతూ వేధింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి.పోలీసుల వివరాల ప్రకారం.. గణపత్ గవిల్ అనే వ్యక్తి థానే జిల్లాలోని ఓ గిరిజన పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. పాఠశాలలో చదువుతున్న బాలికలు భోజనం కోసం వెళ్లిన సమయంలో వారితో అసభ్యంగా ప్రవర్తిస్తూ, అనుచితంగా తాకుతూ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బాధిత విద్యార్థినులు ఆరోపించారు.కొంతకాలంగా జరుగుతున్న వేధింపులతో తీవ్రంగా ఇబ్బంది పడిన విద్యార్థినులు ధైర్యంగా ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి గణపత్ గవిల్‌ను



అరెస్టు చేశారు. బాలికల వాంగ్మూలాలను నమోదు చేసి ఘటనపై దర్యాప్తు చేపట్టారు.అయితే విచారణలో గణపత్‌కు సంబంధించిన గత చరిత్ర కూడా వెలుగులోకి రావడంతో ఈ ఘటన మరింత వివాదాస్పదంగా మారింది. గతంలోనూ ఓ పాఠశాలలో బాలికలను లైంగికంగా వేధించిన కేసులో అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. ఆ కేసులో జైలుకు వెళ్లి వచ్చిన అనంతరం కూడా అతడికి మళ్లీ పాఠశాలలోనే ఉద్యోగం ఇవ్వడం ఇప్పుడు తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన పాఠశాలలో గతంలో పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని తిరిగి విధుల్లోకి ఎలా తీసుకున్నారు? అతడి నేపథ్యాన్ని అధికారులు ఎందుకు పరిశీలించలేదు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థుల భద్రత విషయంలో పాఠశాల యాజమాన్యం, సంబంధిత అధికారుల బాధ్యతపై కూడా చర్చ మొదలైంది.ప్రస్తుతం గణపత్ గవిల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని బాలికల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. పాఠశాలలో అతడికి ఉద్యోగం కల్పించిన విధానం, అతడి గత నేర చరిత్రపై సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనే అంశాలపైనా విచారణ జరిపే అవకాశం ఉంది.గతంలోనే పోక్సో కేసులో జైలుకు వెళ్లిన వ్యక్తి మళ్లీ అదే తరహా ఆరోపణల్లో చిక్కుకోవడం.. అందులోనూ 22 మంది బాలికలు బాధితులుగా ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థుల భద్రత విషయంలో మరింత కఠినమైన నిబంధనలు, నేపథ్య పరిశీలన అవసరమనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# పల్లెర్లలో ఎంఆర్పిఎస్, ఎంఎస్పీ
# గ్రామ శాఖ నూతన కమిటీలు

**ఎంఆర్పిఎస్ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ బాటలో అసమానతలు లేని సమాజ నిర్మాణంకై పోరాడుదాం**

**నల్ల చంద్ర స్వామి మాదిగ ఆలేరు నియోజకవర్గ ఇంచార్జీ**

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మత దురంహకారం కుల వివక్షత సాఫీక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం జరిగే కర్తవ్య నిర్వహణకై జాతిని సమగ్ర అభివృద్ధి వైపు నడిపించే దిశగా క్షేత్రస్థాయిలో ఎమ్మార్పీఎస్ కమిటీల పునర్నిర్మాణం ఏర్పాటు చేయుటలో భాగంగాయాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన కమిటీ ఎన్నిక సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి నల్ల చంద్ర స్వామి మాదిగ హాజరై మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించిన అనంతరం ఎమ్మార్పీఎస్ జాతీయ స్థాయిలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగల పేదరిక నిర్మూలన కోసం అదేవిధంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలు లేని వ్యవస్థ కోసం భవిష్యత్తు పోరాటం కొనసాగుతుందని తెలిపారు ఈ పోరాటానికి మాదిగలు మరింత శక్తివంతంగా



సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు.ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ఎమ్మార్పియస్ మండల సదస్సు జిల్లా ఇంచార్జీ బిర్రు మహేందర్ మాదిగ ముఖ్య అతిథిగా జరుగుతుందని సదస్సుకు గ్రామం నుండి తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశానికి విశిష్ట అతిథిగా ఆత్మకూరు(ఎం) మండల కో ఇంచార్జీ మందుల లింగ స్వామి మాదిగ హాజరు కావడం జరిగింది.సమావేశం అనంతరం ఎంఆర్పిఎస్, ఎంఎస్పీ నూతన గ్రామ కమిటీలను ఎన్నుకోవడం జరిగింది.

**నూతన ఎంఆర్పిఎస్ గ్రామ కమిటీ**

అధ్యక్షుడు వస్తుపుల జంగులు మాదిగ, అధికార ప్రతినిధి మోత్కూర్ శేఖర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి మేడి రవి మాదిగ, ఉపాధ్యక్షులు జన్నపాల నరేష్ మాదిగ, కార్యదర్శి కొమ్ము సంతోష్ మాదిగ, కార్యవర్గ సభ్యులుగా ఎడ్ల నవీన్ మాదిగ, మేడి చరణ్ మాదిగ, మేడి అర్జున్ మాదిగ,
ఎడ్ల శివకుమార్ మాదిగ,
మోత్కూర్ నవీన్ మాదిగ,
వస్తుపుల నవీన్ మాదిగ

ఎంఎస్పి నూతన గ్రామ కమిటీ

అధ్యక్షులు కొమ్ము సంపత్ మాదిగ, అధికార ప్రతినిధి మేడి నగేష్ మాదిగ, ప్రధాన కార్యదర్శి ఎడ్ల సంజీవ మాదిగ, ఉపాధ్యక్షులు మేడి ఆనంద్ మాదిగ, కార్యదర్శి వస్తుపుల పాపయ్య మాదిగ, కార్యవర్గ సభ్యులుగా మేడి నర్సింగ్ రావ్ మాదిగ, ఎడ్ల సహదేవ్ మాదిగ,వస్తుపుల మల్లేష్ మాదిగ, సంగపాక నవీన్ మాదిగ, మేడి నర్సింహ్మా మాదిగ తదితరులను ఎన్నుకోవడం జరిగింది.

మండల కమిటీ కి గ్రామం నుండి ఎమ్మార్పియస్, ఎంఎస్పీ బాధ్యులుగా

మేడి రామ్ లక్ష్మణ్ మాదిగ,జన్నపాల శేఖర్ మాదిగ,మేడి స్వామి మాదిగ, కొమ్ము మత్స్యగిరి మాదిగ,కొమ్ము రాజు మాదిగ, ముత్తయ్య మాదిగ లు ఎన్నికయ్యారు.జర్నలిస్ట్ విభాగానికి మేడి స్వామి మౌర్య మాదిగ ఉద్యోగ విభాగానికి మోత్కూర్ కృష్ణ మాదిగ లు ఎన్నికయ్యారు.



# దేశంలో మహిళల పరిస్థితి ఏమవుతుంది..? సెన్సార్ బోర్డు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి..!





హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, సెంట్రల్ డెస్క్:
దక్షిణాది సూపర్ స్టార్ యష్ నటించిన 'టాక్సిక్' చిత్రం విడుదలైన మరుసటి రోజే వివాదంలో చిక్కుకుంది. పలువురు ప్రముఖ నటులు నటించిన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రంపై, మహిళలను మితిమీరిన శృంగార కోణంలో చూపించడం, వివక్షాపూరిత వైఖరిని ప్రదర్శించడం వంటి ఆరోపణలు వస్తున్నాయి.మాజీ బీజేపీ నాయకుడు, 'వీ ద లీడర్స్' వ్యవస్థాపకుడు అయిన కె. అన్నామలై, మహిళల పట్ల వివక్షాపూరిత వైఖరిని ప్రదర్శించినందుకు గాను ఈ చిత్రాన్ని విమర్శించారు. అలాగే, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన ఆయన, ఈ చిత్రానికి ఆమోదం తెలిపిన ఆ సంస్థ నిర్ణయాన్ని ప్రశ్నించారు.మాజీ ఐపీఎస్ అధికారి నుంచి రాజకీయ నాయకుడిగా మారిన అన్నామలై మాట్లాడుతూ "నిబంధనలు కఠినంగా ఉండాలి. సినిమాలో పెద్ద తారలు నటించినప్పటికీ, ఏ సన్నివేశాలను ప్రదర్శించవచ్చో నిర్ణయించే విషయంలో సెన్సార్ బోర్డు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలి."ఆ సినిమా విజయం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, మహిళలను ఒక నిర్దిష్ట దృక్పథంతో చూపించే సినిమాలను పిల్లలు చూస్తే అది ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని అన్నామలై పేర్కొన్నారు.ఈ సినిమా విడుదలైన మొదటి రోజే ?104 కోట్లు వసూలు చేసింది. ఇందులో మహిళలను ఒక నిర్దిష్టమైన రీతిలో చూపిస్తున్నారు; ఇలాంటి సినిమాలను మనం పిల్లలకు ప్రతిరోజూ చూపిస్తే, ఈ దేశంలో మహిళల పరిస్థితి ఏమవుతుంది? అని ప్రశ్నించారు.ఇదిలావుంటే.. హైదరాబాద్‌లో జరిగిన 'టాక్సిక్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో చిత్రంలో మహిళలను చూపించిన విధానంపై వచ్చిన విమర్శలకు యశ్ స్పందిస్తూ.. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌కు మద్దతుగా నిలిచారు.ఈ పీరియడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాను కేవీఎన్ ప్రొడక్షన్స్, యష్ యొక్క మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ నిర్మించాయి. అత్యంత ఖరీదైన భారతీయ చిత్రాలలో ఒకటిగా ప్రచారం పొందుతున్న దీనిని కన్నడ, ఆంగ్ల భాషలలో చిత్రీకరించారు. ఈ చిత్రంలో యష్ ద్విపాత్రాభినయం చేయగా, నయనతార, తారా సుతారియా, కియారా అద్వానీ, హుమా ఖురేషి, రుక్మిణి వసంత్ కూడా నటించారు.

# ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు రాఖీ కట్టిన మార్కెట్ చైర్మన్



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఆగస్టు 28, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం రోజు మార్కెట్ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్‌రెడ్డి రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ కట్టిన మార్కెట్ చైర్మన్ చైతన్య మహేందర్‌రెడ్డికి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్ పల్స్